క్లుప్తంగా

కార్మికుల ఉద్యోగ విరమణ



కార్మికుడిని సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలో పనిచేస్తున్న ముగ్గురు రెగ్యులర్ కార్మికులు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ కిశోర్, కౌన్సిలర్లు హాజరై కార్మికులు నారాయణమ్మ, కులుసుంబీ, వేమ నారాయణను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, ప్రశాంతి, జ్యోతి, పొరాళ్ల గోవింద రాజులు, శ్రీనివాసరెడ్డి, బండి అజయ్, కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, గంగాధర్, ఇస్మాయిల్, దివాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రభానందను సన్మానిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ప్రభానందను శనివారం సన్మానించారు. శనివారం పాఠశాలలో జరిగిన సన్మాన సభలో విద్యార్థులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆదిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫణికుమార్ సేవలు అమూల్యం



ఫణికుమార్‌ను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

కూడేరు: మండల కేంద్రంలోని అనంత ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఫణికుమార్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. మేనేజర్ రవికుమార్, సిబ్బంది, ఖాతాదారులు ఫణికుమార్‌ను సన్మానించారు. సిబ్బంది జాహ్నవి, వరలక్ష్మీ, రాములు, రాజేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి సేవలు ఎనలేనివి



పద్మావతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ పద్మావతి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. పద్మావతి, మల్లికార్జున దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



తగ్గుపర్తిలో ఈశ్వరప్పను సన్మానిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: తగ్గుపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు బులుగుండ్ల ఈశ్వరప్పను తోటి ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. పాఠశాల హెచ్ఎం వెంకటప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ సహకార సంఘ అధ్యక్షుడు వెంకటనాయుడు, హెచ్ఎం వెంకటప్రసాద్, బాలాజీ, మురళీధర్, ఉపాధ్యాయులు హరికృష్ణ, శంకరయ్య, రాజశేఖర్, విశ్రాంత టీచర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



గడేకల్లులో సన్మానం పొందుతున్న రామాంజనేయులు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం రామాంజనేయులు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. హెచ్ఎంకు ఎంపీపీ కరణం పుష్పావతి, ఎంఈఓ మల్లికార్జున, ఇన్‌చార్జ్ హెచ్ఎం అపర్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీంరెడ్డి, సర్పంచు సుశీల, ఎంపీటీసీ ఓబుళేసు, నాయకులు హేమంత్, ప్రసాదు, ఉమాశంకర్ సురేష్ యదవ్ తదితరులు శాలువా కప్పి సత్కరించారు.

శేషారెడ్డి సేవలు మరువలేనివి



హెచ్ఎం టీ.శేషారెడ్డిని జ్ఞాపికను అందిస్తున్న ఎంఈఓలు, హెచ్ఎంలు

కణేకల్లు: విద్యాభివృద్ధి కోసం హెచ్ఎం శేషారెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఎంఈఓ-1 లక్ష్మన్న, ఎంఈఓ-2 భవానీశంకర్ తెలిపారు. శనివారం స్థానిక హిందూ బాలుర స్కూల్‌లో హెచ్ఎం టీ.శేషారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. అనంతరం సభనుద్దేశించి ఎంఈఓలు మాట్లాడారు. ఏపీటీఎఫ్ నాయకులు మోసెస్, శివారెడ్డి, జయరామిరెడ్డి, హెచ్ఎంలు అన్నపూర్ణ, వెంకటలక్ష్మీ, నారాయణస్వామి, పరమేశ్వరప్ప, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. కార్పొరేట్ కిట్లు

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తెరిచిన దుకాణాలు
- రాయదుర్గంలో యథేచ్ఛగా విక్రయాలు
- విద్యాసామగ్రి పేరిట అ'ధన'ంగా వసూలు
- అవస్థలు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



రాయదుర్గంలో నారాయణ పాఠశాలలోని పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రాయదుర్గం: పట్టణంలోని నేసేపేటలో జీన్స్ ప్యాంట్లు కుడుతూ దినసరి కూలీగా జీవనం సాగించే ఓ వ్యక్తి ..స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో తన కుమారుడిని ఎల్‌కేజీలో చేర్పించాడు. ఫీజులు, యూనిఫాం, పుస్తకాల పేరిట రూ.22వేలు చెల్లించాలని రోదు ఇచ్చారు. ఖంగుతిన్న ఆ వ్యక్తి.. ప్రైవేట్ పాఠశాలలో చదివించడం భారమని అడ్మిషన్ వాపస్ తీసుకున్నాడు. మరో వ్యక్తిది కూడా ఇదే పరిస్థితి. విధిలేని పరిస్థితిలో తన కుమారుడిని అదే పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది. ఇలా ఈ ఇద్దరే కాదు..చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొ'రేట్' ఫీజులు, విద్యాసామగ్రి కోసం అధనంగా చెల్లించలేక అల్లాడిపోతున్నారు. విద్యాసంవత్సరం వచ్చిందంటే చాలు..ఓ వైపు వ్యవసాయం కోసం పెట్టుబడి, మరోవైపు చదువుల కోసం అయ్యే ఖర్చులు భరించలేకపోతున్నారు.

'రాయదుర్గం' నియోజకవర్గంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్య పెద్ద వ్యాపారం అయ్యింది. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను చదివించలేకపోతున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఒక్కొక్కరు ఒక్కో బ్రాండ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. పాఠశాల ఆవరణాల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయించొద్దని విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. రాయదుర్గం నియోజకవర్గంలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 52 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు వెలిశాయి. ఇందులోని చాలా పాఠశాలల్లో అధిక ఫీజులు సరాసరే. దీనికితోడు తోడు దుస్తులు, పుస్తకాలు, ట్యూషన్, బస్సు ఫీజులు, బూట్లు, టై తదితరాల విద్యాసామగ్రి ధరలు అమాంతం పెంచేసి, ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, విద్యాసామగ్రి, యూనిఫాం బయట మార్కెట్లో కొనుగోలు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు అంటే కుదరదని పాఠశాలల యాజమాన్యలు ఖరాకండిగా చెప్తున్నాయి.

ధరల్లో భారీగా తేడా..

బయట మార్కెట్లో దొరికే వస్తువుల ధరలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లభించే వాటికి భారీగా వ్యత్యాసం ఉంటుంది. నర్సరీ నుంచి ఎల్‌కేజీ వరకు స్థాయి విద్యార్థులకు పుస్తకాలు, టై, బెల్టు, బూట్లు, ఏకరూప దుస్తులు, బ్యాడ్జీలు, గుర్తింపు కార్డులు, బ్యాగులు, కవర్లు, పెన్నులు, పెన్సిళ్ల కొనుగోలుకు రూ.4,500 నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. కొన్ని పాఠశాలల్లోనే యథేచ్ఛగా విక్రయాలు జరుపుతుండగా, మరి కొన్ని చోట్ల ప్రత్యేకంగా పాఠశాలల్లోనే పుస్తకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. మరి కొందరు పుస్తకాల విక్రయ దుకాణదారులతో ఒప్పందం కుదుర్చుకొని వ్యాపారం సాగిస్తున్నారు.

తడిసి మోపెడవుతున్న ఫీజులు

యూనిఫాం, ప్రత్యేక వారాల్లో వేసే దుస్తులు మొదలు ఇతర విద్యా సామగ్రి కలుపుకొని రూ. వేలకు వేలు ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో విధంగా రూ.5,500 వరకు వ్యత్యాసం ఉంటోంది. ప్రైవేటు పాఠశాలల్లో విక్రయించే పుస్తకాలు ఎక్కడ దొరక్కుండా చూస్తున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకైతే ఐఐటీ, నీట్ తరగతుల పేరుతో మరింత దండుకుంటున్నారు. నిజానికి ఆరో తరగతి నుంచి ప్రభుత్వ పుస్తకాలనే బోధించాలి. తామిచ్చే బుక్స్‌లోనే అవన్నీ ఉంటాయంటూ వారివద్ద ఉండే పుస్తకాలు అంటగట్టేస్తున్నారు.

పలు పాఠశాలల్లో సామగ్రి సీజ్..

విద్యార్థుల తల్లిదండ్రుల బాధలను అర్థం చేసుకున్న విద్యార్థి సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఇటీవల స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద అదనపు ఫీజుల వసూళ్లకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ప్రైవేట్ పాఠశాలల్లో తెరిచిన పుస్తకాల దుఖాణాలను సీజ్ చేయించారు. అనధికారికంగా తెరుచుకున్న బుక్ కేంద్రాలను వారి సమక్షంలోనే సీజ్ చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాయి.

చర్యలు చేపట్టాలి



పట్టణంలోని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో దుఖాణం తెరిచి వ్యాపారం సాగిస్తున్నారు. విద్యాసామగ్రిని సీజ్ చేయించాం. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాం. పోరాటాలు ఉధృతం చేస్తాం. విద్యార్థి సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు.

– బంగి శివా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



అధిక ఫీజులతో పాటు పాఠశాలల్లో విద్యాసామగ్రి అమ్మకం చేపట్టే యజమానులకు నోటీసులు జారీ చేశాం. ఇప్పటికే పలు పాఠశాలల్లో విద్యాసామగ్రిని సీజ్ చేయించాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు చేపడతాం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఫీజుల విషయంలో నిలదీయాలి. అప్పుడే పూర్తిస్థాయి అడ్డుకట్టుకు సాధ్యమౌతుంది.

– నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

మల్లికార్జునరెడ్డి కుటుంబానికి విశ్వ పరామర్శ



మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నేత మల్లికార్జునరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి మల్లికార్జున రెడ్డి ఇంటికి శనివారం వెళ్లారు.కుటుంబ సభ్యులను పరామర్శించి, మల్లికార్జున రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నేతలు బెస్త రమణ, సీపీవీరన్న, సర్పంచ్ ధనుంజయ్యతో పాటు పలవురు నేతలు పాల్గొన్నారు.

హాకీ అకాడమీకి పాల్తూరు విద్యార్థిని ఎంపిక



ఆర్డీటీ హాకీ అకాడమీకి ఎంపికైన జ్యోతి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని జ్యోతి ఆర్డీటీ అకాడమీకి ఎంపికయ్యిందని పీడీ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించే హాకీ శిక్షణలో జ్యోతి ప్రతిభ కనబరిచింది. భవిష్యత్‌లో జ్యోతి మరింత ఉన్నత స్థాయికి చేరాలని హెచ్ఎం సర్వమంగళం ఆకాంక్షించారు.

ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ

శెట్టూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నరసింహామూర్తి తెలిపారు. లబ్ధిదారులకు 1 వతేదీ ఉదయం 6 గంటల నుంచి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

రాజీమార్గానికి వేదిక లోక్ అదాలత్



లోక్ అదాలత్‌లో కేసులు రాజీచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్



ఉరవకొండ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి దుర్గాకళ్యాణి



కళ్యాణదుర్గం లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

రాయదుర్గంటౌన్: కక్షిదారులు రాజీమార్గంతో కేసులు పరిష్కరించుకునేందుకు అత్యుత్తమ వేదిక 'జాతీయ లోక్ అదాలత్' అని సీనియర్ సివిల్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ ఇన్‌చార్జ్ చైర్మన్ ఎం.శ్రీధర్ తెలిపారు. శనివారం రాయదుర్గం కోర్టులో ఇన్‌చార్జ్ జడ్జి (హిందూపురం) ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జడ్జి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్‌తోపాటు ఇతర కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో జడ్జి ఆధ్వర్యంలో రాజీమార్గంతో 27 వివిధ రకాల కేసులతోపాటు 139 ఎస్టీసీ (పెట్టి కేసులు)లను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 108 కేసులు పరిష్కారం

ఉరవకొండ: ఉరవకొండ మున్సిఫ్ ఫస్ట్‌క్లాస్ మేజిస్టేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ డి.దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. క్రిమినల్-3, సివిల్-8, పెట్టి-90, బ్యాంకు-7 మొత్తం 108 కేసులు పరిష్కారమయ్యాయి. వీటి ద్వారా రూ.6 లక్షలు వచ్చింది. లోక్‌అదాలత్‌లో లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు జయరాజ్, తుకారం, అడ్వొకేట్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

కళ్యాణదుర్గం: రాజీ మార్గమే రాజ మార్గమని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి జడ్జి మాట్లాడారు. క్షణికావేశంతో జరిగే అనర్థాలతో ఎంతో మంది ఆర్థిక నష్టంలో కూరుకుపోతున్నారన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారన్నారు. అనంతరం జాతీయ లోక్ అదాలత్‌లో వచ్చిన సివిల్ కేసులు 5, ఐపీసీ కేసులు 19, ఎక్సైజ్ కేసులు 6, చెక్ బౌన్స్ కేసు 1, పీఎల్‌సీ 1, సెకెండ్ క్లాస్ కోర్టువి అధికంగా వచ్చాయి. న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, హరిచక్రవర్తి, దాదాఖలందర్, దేవేంద్ర, రామాంజినేయులు, తిమ్మప్ప చౌదరి, టౌన్ సీఐ హరినాథ్ పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీసేందుకు సిద్ధమవుదాం

- మాజీ ఎంపీ తలారి రంగయ్య



నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వంలో ఎదురయ్యే ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన, సమస్యలపై నిలదీసేందుకు సిద్ధమవుదామని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నియమించిన పలు పోస్టులలో పని చేస్తున్న పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పలువురు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో డీలర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు ఇలా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం విధుల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నియమించిన వారిని తొలగించేలా కుటిల యత్నం చేస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతికి టీడీపీ నాయకులు తెర లేపారని, మాజీ ఎంపీ వద్ద తెలిపారు. అయితే గ్రామాల్లో ప్రజా పక్షాన అండగా నిలబడుతూ ప్రజా సమస్యలపై నిలదీసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రంగయ్య పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులకు తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు ఎంఎస్ రాయుడు, రామాంజనేయులు, ఎస్సీ సెల్ నాయకులు చామలూరు రాజగోపాల్, గుప్తా, నారాయణస్వామి, రామిరెడ్డి, ఉమేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

ఉరవకొండ: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో భక్తులకు కనీస వసతులు కల్పించేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెద్ద ముష్టూరు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం కౌలు రైతు సంఘం నాయకులు వన్నూర్‌స్వామి, ఓబయ్యతో కలిసి అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. పెన్నహోబిలంలో బస చేసే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు.

వైభవంగా జమాలుద్దీన్ ఖాద్రీ ఉరుసు



అలంకరణలో జమాలుద్దీన్ ఖాద్రీ స్వామి సమాధి

ఉరవకొండ: స్థానిక జామీయ మసీదు వద్ద ప్రసిద్ధి గాంచిన హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాద్రీ తాసీర్ దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. శుక్రవారం రాత్రి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక జామాలుద్దీన్ దర్గా ఆవరణ నుంచి మేళాతాళాలతో భారీగా గంధం ఊరేగించారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా స్వామి సమాధిని విశేషంగా వివిధ రకాల పూలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌షా అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబాల ఆధ్వర్యంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

గర్భకోశ చికిత్సలతో పశు సంపద వృద్ధి



వెంకటంపల్లిలో పశువులకు గర్భకోశ చికిత్సలు చేస్తున్న పశువైద్యాధికారులు

కుందుర్పి: ఉచిత గర్భకోశ చికిత్సతో పశుసంపద వృద్ధి చెందుతుందని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ సూచించారు. శనివారం మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో మేలురకం ఆవులు, గేదెల్లో పెయ్యిదూడలు మాత్రమే ఇవ్వగలిగే లింగ నిర్ధారిత వీర్యం వినియోగం కోసం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ సహాయ సంచాలకులు నాగలింగేశ్వర్‌రెడ్డి,పశు వైద్యాధికారి ప్రసాద్ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు.

నగర వనం పార్కు అభివృద్ధికి కృషి

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు బళ్లారి రోడ్డులోని నగరవనం పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ దామోదారరెడ్డితో కలిసి సందర్శించారు. పార్కులో సౌకర్యాలు మెరుగుపరిచి, ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కలు నాటారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

విడపనకల్లు: మండల పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి కానుకల హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం జూలై 1న ఉంటుందని ఆలయ ఈఓ రమేష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అగ్రిగోల్డ్ భూములను కాపాడండి

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద 252 ఎకరాల్లో అగ్రిగోల్డ్ సంస్థ ఏర్పాటు చేసిన వెంచర్లోని భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అగ్రిగోల్డ్ కష్టమర్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధేశ్వర డిమాండ్ చేశారు. శనివారం అగ్రిగోల్డ్ కష్టమర్, ఏజెంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కూడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణ స్వామి, సీపీఐ వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి, సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

18 మందిపై బైండోవర్ కేసులు నమోదు

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరంలో 18 మందిపై బైండోవర్ కేసులు నమోదయినట్లు ఎస్ఐ శివ శనివారం తెలిపారు. గ్రామంలో ఇరువర్గాలకు చెందిన వారిని 18 మందిపైన బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.వారిని తహసీల్దార్ హరినాథ్‌రావ్ ఎదుట హాజరు పరిచి, రూ.లక్ష చొప్పున సొంత పూచీకత్తుతో బెయిల్ అందించినట్లు తెలిపారు.

జపాన్ సాఫ్ట్‌బ్యాంక్ కంపెనీలో రైతుబిడ్డకు కొలువు



విజయకుమార్

శెట్టూరు: మండలంలోని ఐచ్చేహళ్లిలో సాధారణ రైతు గంగాధర కుమారుడు జి. విజయ్‌కుమార్ జాపాన్‌లోని ప్రముఖ సాఫ్ట్ బ్యాంక్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. ఏడాదికి రూ.32 లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యాడు. విజయ్‌కుమార్ రాయచోటి శ్రీ సత్యసాయి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థికి గ్రామంలో రైతులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



శీగలపల్లి సమీపంలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జార్ఖండ్ ప్రతినిధులు

కుందుర్పి: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించాలని, అప్పుడే మానవ మనుగడ సాధ్యమని జార్ఖండ్ రాష్ట్రం ఆదివాసీ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధులు విక్రాంత్ తివారీ, సుప్రియా పాటిల్ తదితరులు పేర్కొన్నారు. శనివారం మండల కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో శీగలపల్లి వద్ద లక్ష మొక్కల నాటే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ వెల్ఫేర్ ఫౌండేషన్, మండల కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల సంఘం సౌజన్యంతో రైతుల బీడుభూముల్లో లక్ష మొక్కల పెంపకానికి తమ సంస్థలు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతులు మొదట పొలాల్లో గుంతలు తీసిన వెంటనే తమకు ఫిర్యాదు చేస్తే పొలాలను పరిశీలించి, పండ్ల మొక్కలు అందిస్తామన్నారు. ఏడాది పాటు మొక్కల సంరక్షణ నిధులను తమ సంస్థ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన సుస్థిర వ్యవసాయ స్థాపకులు నవీన్‌కుమార్, మండల డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీపతి, మురళి, సీఎస్పీ కోఆర్డినేటర్ నరసింహమూర్తి, రైతులు బలదేవరెడ్డి పాల్గొన్నారు.

కారు బోల్తా .. ఒకరికి గాయాలు



కూడేరు వద్ద రహదారిపై బోల్తా పడిన కారు

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న చంద్రకళ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన మేరకు ..అనంతపురానికి చెందిన పరమేశ్వరప్ప కుందిర్పి మండలంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. పరమేశ్వరప్ప భార్య చంద్రకళ గాయపడింది. మిగిలిన ఇద్దరికి గాయాలు కాలేదు. చంద్రకళను 108 వాహనంలో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నింబగల్లు జెడ్పీహెచ్ఎస్‌లో అతిసారా వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

కంబదూరు: సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని అచ్చంపల్లిలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. 48 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. వైద్య సిబ్బంది సవారమ్మ, కామక్షి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి కుమార రాజా అన్నారు. శనివారం మండలంలోని లింగదహాళ్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ దేవదాస్, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఏఎన్ఎంలు వెంకటరమణ, ఎర్రమ్మ నాగరత్నమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో అతిసార అరికడదాం

కంబదూరు: ముందు జాగ్రత్తలు తీసుకుంటే అతిసారను అరికట్టొచ్చని మండల వైద్యాధికారి ఆసియా తెలిపారు.శనివారం డాక్టర్ ఆసియా మాట్లాడుతూ అతిసారాను అరికట్టేందుకు జూలై 1 నుంచి ఆగస్టు నెల వరకు విస్తృతంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఉరవకొండ: మండలంలోని నింబగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతిసారా, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం కొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీవీ అనికేత్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఎంపీహెచ్ఓ గోవిందు, హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

వజ్రకరూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచు మోనాలిసా కోరారు. శనివారం మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి నల్ల బోతుల రాజు, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, సూపర్‌వైజర్ నాగశంకర్, ఏఎన్ఎం సుకన్య, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.